# ప్రతిపక్షాలను బొంద పెట్టాలి

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి
- రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీ లేదు
- కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి

కందుకూరు, అక్టోబర్ 27 : ఈ ఎన్నికల్లో ప్రతి పక్షాలను బొంద పెట్టాలని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సామ నర్సింహా రెడ్డి ఫంక్షన్ హాలులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. అంతకు ముందు హైదరాబాద్, శ్రీశైలం రహదారిపై పటాకులు కాలుస్తూ మంత్రికి స్వాగతం పలికి, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రానికి బీజేపీ చేసిందేమీలేదన్నారు. ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్, బీజేపీల అభ్యర్థులకు బుద్ధి చెప్పాలని ప్రజలకు సూచించారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలకు కండ్లు మండుతున్నాయన్నారు. దేశానికి అన్నం పెట్టే స్థాయికి రాష్ట్రం ఎదిగిందని, దీనికంతటికి కారణం సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజలు, రైతులు కాంగ్రెస్ పార్టీని నమ్మి మోసపోవద్దని కోరారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారా? అని ప్రశ్నించారు. కరెంట్, తాగు నీరు, అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న మనం కాంగ్రెస్‌కు ఓటేస్తే ఆగం కావాల్సి వస్తుందన్నారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలకు నమ్మకం, విశ్వాసం ఉందని తెలిపారు. వందేండ్ల ప్రగతిని సీఎం కేసీఆర్ 10ఏండ్లలో చేసి చూపించారని వివరించారు.

## అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మాదాపూర్, అక్టోబర్ 27: కండ్ల ముందే జరిగిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని శేరిలింగంపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్, ఇజ్జత్ నగర్ కాలనీలో ఎమ్మెల్యేకు మద్దతుగా అసోసియేషన్ ప్రతినిధులు, ప్రజలతో కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కండ్ల ముందే ఉన్నదని, దానిని చూసి మరోసారి తనను ఆశీర్వదించాలన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలబెట్టడానికి నా వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గాన్ని ఇప్పటి వరకు రూ. 9 వేల కోట్ల నిధులతో అభివృద్ధి చేశానని తెలిపారు. శేరిలింగంపల్లిలో ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, కొత్త రోడ్లు వేశామన్నారు. అభివృద్ధికే పట్టం గడుతామని..ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీకి పూర్తి స్థాయి మద్దతు ఇస్తామని ఆదిత్యా నగర్, ఇజ్జత్ నగర్ కాలనీ వాసులు పేర్కొన్నారు. ఈ సమావేశంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళలకు బీఆర్ఎస్ హామీలను వివరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

## ప్రతిపక్షాలను ప్రజలు నమ్మరు


మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్‌పేట్, అక్టోబర్ 27 : ఎన్నికల సమయంలో గద్దల్లా వాలిపోయే కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, ఎన్నికల తరువాత వారి అడ్రస్ ఉండదని సనత్‌నగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం బన్సీలాల్‌పేట్ డివిజన్‌లోని భోలక్‌పూర్ ప్రాంత బస్తీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ ఏసూరి సావిత్రి మహేశ్ ఆధ్వర్యంలో జరిగిన పాదయాత్రలో ఆయనకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ఆ రెండు పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడి నుంచి గెలిచి కేంద్ర మంత్రి అయిన కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక బస్తీలు, సమస్యలపై అవగాహన ఉన్న తనకు మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత, మాజీ కార్పొరేటర్ సావిత్రి, బీఆర్ఎస్ ఇన్‌చార్జి జీ.పవన్‌కుమార్ గౌడ్, మహేశ్వర రావు, కే.లక్ష్మీపతి, డివిజన్ అధ్యక్షుడు వెంకటేశన్‌రాజు, కార్యదర్శులు ఎం.మహేందర్, రాజేందర్, నాయకులు తలసాని శంకర్ యాదవ్, ధర్మేందర్ యాదవ్, మహేశ్ యాదవ్, రవీందర్ యాదవ్, టి.శ్రీనివాస్ యాదవ్, సంతోశ్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్, మారుతి, బాబు, శ్రీరాములు, నాగలక్ష్మి, శోభారాణి, లక్ష్మి పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో..

## ప్రతిపక్షాల గుండెల్లో వణుకు

ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ❖ నాగోల్ నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభం



నాగోల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, అక్టోబర్ 27: సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోతో ప్రతిపక్ష పార్టీల గుండెల్లో వణుకు మొదలైందని ఎల్బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శుక్రవారం ఆయన సతీమణి కమలా సుధీర్‌రెడ్డితో కలిసి నాగోల్ డివిజన్‌లోని జైపురికాలనీ, డీఆర్‌ఎఫ్ కేంద్రం దగ్గర ఉన్న హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలో ఏండ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రిజిస్ట్రేషన్లు, యూఎల్‌సీ సమస్యను పరిష్కరించామన్నారు. సీఎం కేసీఆర్ ప్రకటించిన మ్యానిఫెస్టోను చూసి ప్రతిపక్ష పార్టీల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టామని తెలిపారు. నియోజకవర్గంలో ఎస్‌ఆర్‌డీపీ పనుల్లో భాగంగా ఎల్బీనగర్త్, నాగోల్, కామినేని , బైరామల్‌గూడ , చింతలకుంట చౌరస్తాల్లో ఫ్లైఓవర్లు, అండర్‌పాస్ రోడ్ల నిర్మాణాలు చేపట్టి ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా మార్చామన్నారు. నాగోల్ వద్ద నూతన సైకిల్ ట్రాక్ నిర్మాణ పనులను ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాల్లో నివసిస్తున్న ప్రజల కోసం జీఓ నం. 58, 59ను తీసుకొచ్చామని చెప్పారు.అంతకుముందు పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి మద్దతుగా తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్ గుప్త, మాజీ కార్పొరేటర్లు సంగీత, రమావత్ పద్మానాయక్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు చిరంజీవి, నాయకులు రాజిరెడ్డి, ప్రశాంత్‌గౌడ్, గణేశ్ యాదవ్, ప్రమీల, సీతారాములు గౌడ్, ఆజాద్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## ప్రతిపక్ష పార్టీల మాటలు నమ్మొద్దు..



కంటోన్మెంట్ ఒకటో వార్డులో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, అక్టోబర్ 27 : తనను ఆశీర్వదించి గెలిపిస్తే.. నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత అన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం ఒకటో వార్డు పరిధిలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డితో కలిసి లాస్యనందిత ప్రచారం నిర్వహించారు. బోయిన్‌పల్లి పెద్ద తోకట్ట, కట్టెల మండి, కంసారి బజార్, చింతల్ బస్తీల్లో ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు, మ్యానిఫెస్టోను వివరిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతిపక్ష పార్టీల మాయమాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు గల్లంతవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అవి పూర్తిస్థాయిలో అమలు కావాలంటే మళ్లీ కేసీఆరే రావాలన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యులు అనితా ప్రభాకర్, నళిని కిరణ్, బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, రామకృష్ణ, శ్రీనివాస్, మీనా భాస్కర్, అసిమ్ ఖాన్, ఇర్ఫాన్, నవీన్, పద్మ, ప్రభు గుప్తా, పలువురు నాయకులు, ఉద్యమకారులు, యువ నాయకులు, బీఆర్ఎస్ అనుబంధ సంఘాల సభ్యులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హ్యాట్రిక్ ఖాయం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



బూత్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్, అక్టోబర్ 27 : తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం పాత విమానాశ్రయం రోడ్డులోని తెలంగాణ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన బాలానగర్ డివిజన్‌కు చెందిన బూత్ కమిటీ సమావేశానికి డివిజన్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావు మాట్లాడుతూ... సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నేతృత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి వేలాది కోట్లు వెచ్చించి అభివృద్ధి చేశామన్నారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టో ప్రజలందరిని మెప్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య, మందడి సుధాకర్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు శాకయ్య, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాజా, నాయకులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో బండారి ఇంటింటి ప్రచారం



ఉప్పల్‌లో ప్రచారం చేస్తున్న ఉప్పల్ బీఆర్ఎస్‌పార్టీ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ఉప్పల్, అక్టోబర్ 27: ఉప్పల్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం విస్తృత ప్రచారం చేపట్టారు. ఈ మేరకు ఉప్పల్ శాంతినగర్, విజయపురికాలనీ, ఉప్పల్ మైదానం, వాకర్స్‌తో కలిసి ప్రచారం చేశారు. ఉప్పల్‌లోని వాకర్స్‌తో కలిసి నడుస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని, మీకు తోడుగా ఉంటానన్నారు. అలాగే ఉప్పల్‌లోని పలు కాలనీల్లోని ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను తెలియజేస్తూ, ప్రభుత్వం చేపట్టిన ప్రగతిని వివరించారు. వృద్ధులను, యువతను, మహిళలను కలిసి ఓటు అభ్యర్థిస్తూ, వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ ముదిరాజ్, డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, మహేందర్, నేతలు పాల్గొన్నారు.

## హైదరాబాద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

సిటీబ్యూరో, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ అభివృద్ధికి ఎంఐఎం కట్టుబడి ఉన్నదని, నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తోందని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో జీజేపీ గెలుస్తోంది అంటే అది కాంగ్రెస్ తీరు వల్లే కానీ, ఎంఐఎం వల్ల కాదని ఆయన స్పష్టం చేశారు. పెద్దల బలంతోనే ఈ రోజు ఈ స్థాయికి చేరుకున్నామని, ఇదే ఒరవడిని ఎంఐఎం కొనసాగిస్తుందన్నారు. హైదరాబాద్ అభివృద్ధికి పాటుపడతామని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు.


హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
హయత్ నగర్ సర్కిల్-3
GHMC

NIT No. E/5826/19/2023-24/292, తేది: 26-10-2023

**పని పేరు:** ''హయత్‌నగర్ సర్కిల్-3, GHMCలో వార్డ్ నం. 12,13 & 14లలో పోలింగ్ స్టేషన్ల కొరకు ర్యాంప్స్‌వంటి హామీగల కనీస సదుపాయాలు ఏర్పాటు చేయుట (4 పనులు) కొరకు'' **అంచనా మొత్తం: రూ. 7.33 లక్షలు. బిడ్ల స్వీకరణకు చివరి తేది & సమయం:** 28-10-2023న మ|| 04.30 గం. **అధికారి పేరు & చిరునామా, సెల్ నెం:** శ్రీ కె. రమేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, హయత్ నగర్ సర్కిల్-3, GHMC, సెల్ నెం: 8790374055 & 7331189513. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్: http://www.eprocurement.telangana.gov.in/లో చూడవచ్చును.

DIPR RO.No. 8194-PP/CL/ADVT/1/2023-24, Dt: 27-10-2023 సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, హయత్ నగర్ సర్కిల్-3, GHMC.